

దహెగాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వంట గది లేక శిథిలావస్థలో ఉన్న వరండాలో వంట చేస్తున్న కార్మికులు

నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | బుధవారం 10 జూలై 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

### 4 నెలల నుంచి బిల్లులు రావడం లేదు..



దహెగాం, జూలై 9: మాకు మార్చి నెల నుంచి మధ్యాహ్న భోజన బిల్లులు రాలేదు. తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు సంబంధించి కోడి గుడ్లు, భోజనం బిల్లులు అందలేదు. దీంతో ఇబ్బందులు పడుతున్నాం. అప్పులు తెచ్చి సరుకులు కొని వండి పెడుతున్నాం. కార్మికులకు వేతనాన్ని రూ.3 వేలకు పెంచినప్పటికీ ప్రస్తుతం రూ.2 వేలే ఇస్తున్నారు. వంట గదిలేక ఇబ్బ దులు పడుతున్నాం. ప్రభుత్వం మాకు ప్రతి నెలా బిల్లులు అందించి ఇబ్బందులు తీర్చాలి.

**-గురుజాల లక్ష్మి, మధ్యాహ్న భోజన కార్మికురాలు, దహెగాం**

# ప్రాథమిక విద్యపై భస్మాసుర హస్తం

**బిల్లులియ్యరూ.. బ్రేక్‌ఫాస్ట్ పెట్టరూ..**




## పాఠశాల నిర్వహణను గాలికొదిలేసిన కాంగ్రెస్ సర్కారు

- సమస్యల సుడిగుండంలో విద్యార్థులు, మధ్యాహ్న భోజన నిర్వాహకులు
- మౌలిక వసతులు కల్పించకుండా.. వాస్తవాలను వక్రీకరిస్తున్న రేవంత్ ప్రభుత్వం
- మాజీ మంత్రి హరీశ్‌రావు చేసిన ఆరోపణలన్నీ వాస్తవాలే..
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 'నమస్తే' క్షేత్రస్థాయి పరిశీలన

**ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా** ప్రాథమిక విద్య నిర్లక్ష్యానికి గురవుతున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం పాఠశాల నిర్వహణను గాలికొదిలేయడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజన నిర్వాహకులు సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతున్నారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందక ఆకలితో అలమటిస్తున్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకు నెలల తరబడి బిల్లులు రాకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన చెందుతున్నారు. కుక్ అండ్ హెల్పర్లకు, సర్వశిక్ష అభియాన్ సిబ్బందికి వేతనాలు రాకపోవడంతో అవస్థలు పడుతున్నారు. కోడిగుడ్ల బిల్లులు నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉండడంతో ఇబ్బందిగా మారింది. పారిశుధ్య నిర్వహణకు నెలకు రూ. 10 వేలు ఇస్తానన్న కాంగ్రెస్ సర్కారు మాట తప్పింది. ఉచిత కరెంటు ఇస్తామన్న హామీ కూడా ఉత్తదిగానే మారింది. సీఎం బ్రేక్‌ఫాస్ట్ అమలు కాకపోవడంతో విద్యార్థులు పస్తులు ఉంటున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ప్రీమెట్రిక్ స్కాలర్ షిప్స్ రాకపోవడంతో అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఎదురవుతున్న సమస్యలపై మాజీ మంత్రి హరీశ్‌రావు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన సమస్యలపై 'నమస్తే తెలంగాణ' మంగళవారం బడులను సందర్శించింది. హరీశ్‌రావు లేవనెత్తిన సమస్యలు క్షేత్రస్థాయిలో కనిపించాయి. సమస్యలే లేవని ప్రకటించడంపై విద్యార్థులు, మధ్యాహ్న భోజన కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన నిర్వాహకులు, సర్వశిక్ష అభియాన్ రిసోర్స్ పర్సన్స్, విద్యార్థులు తమ ఆవేదనను వెలిబుచ్చారు. వారి మాటల్లోనే అభిప్రాయాలు..

- మంచిర్యాల ప్రతినిధి/కుమ్రం భీం ఆసిఫాబాద్, జూలై 9(నమస్తే తెలంగాణ)

### ఉద్దెర తెచ్చి వండి పెడుతున్నాం..



తాండూర్, జూలై 9 : తంగళ్లపల్లి జడ్పీ పాఠశాలలో గత 15 ఏళ్లుగా మధ్యాహ్న భోజనాన్ని వండిపెడుతున్నాను. నెల నెలా బిల్లులు ఇవ్వకపోవడంతో అప్పులు చేయాల్సి వస్తున్నది. సరుకులు ఉద్దెర తెచ్చి పిల్లలకు వంట చేసి పెడుతున్నా. ఆరు నెలలుగా బిల్లులు రావడం లేదు. సరుకుల పైసలు కట్టాలని షావుకారు అంటున్నాడు. అప్పుల భారం, వేతనాలివ్వలేక ఇద్దరు వంట చేసే కార్మికులను బంద్ చేసిన. మూడేళ్లుగా 6 నుంచి 10వ తరగతి వరకు గుడ్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం వేతనాలు పెంచడం ఏమో కానీ జనవరి నుంచి ఇప్పటి వరకు అసలు బిల్లులే ఇవ్వడం లేదు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని ఒత్తిడి చేస్తున్నారు.

**-రామగిరి వరలక్ష్మి, మధ్యాహ్న భోజన కార్మికురాలు, తంగళ్లపల్లి, తాండూర్**

### బిల్లులు వస్తలేవని టిఫిన్ వండడం లేదు..



తాండూర్, జూలై 9 : గతేడాది అల్పాహారం పథకం ప్రారంభం నుంచి పాఠశాలలో విద్యార్థులకు ఉదయం అల్పాహారం అందించాలని హెచ్‌ఎం తెలుపడంతో టిఫిన్ వండి పెట్టాం. అప్పుడు 40 రోజులపాటు ప్రభుత్వం సూచించిన మెనూ ప్రకారం విద్యార్థులకు అల్పాహారం అందించాం. ఇప్పటివరకు ఆ బిల్లులు రాలేదు. అందుకే పాఠశాలలో అల్పాహారం ఆపివేశాం. బిల్లులు రాకపోవడంతో అప్పులు తెచ్చి వండి పెట్టడం కష్టంగా ఉంది. మాకు బిల్లులు ఇస్తే వంటలు వండిస్తాం. పెండింగ్ బిల్లులు ఇస్తేనే సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని నిర్వహిస్తాం.

**- రావుల కౌసల్య, సీఎం బ్రేక్ ఫాస్ట్ కార్మికురాలు, గోపాల్‌నగర్, తాండూర్**



నిర్వహణ లేకపోవడంతో ఇందిరానగర్ పాఠశాలలో ఇసుక డంపు

### టీచర్ ప్రెసెంట్.. విద్యార్థులు ఆబ్సెంట్..

చింతలమానేపల్లి, జూలై 9 : మండలంలోని బాబాసాగర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఇందిరానగర్ ఎంపీపీఎస్ పాఠశాలలో మొత్తం 13 మంది విద్యార్థులున్నారు. ప్రతి రోజూ టీచర్ వస్తున్నప్పటికీ విద్యార్థులు రావడం లేదు. ఈ విషయంపై టీచర్ పీ ప్రియాంకను వివరణ కోరగా బడి ప్రారంభంలో ఇద్దరు, ముగ్గురు హాజరయ్యారని, వారు కూడా కొన్ని రోజులుగా రావడం లేదని తెలిపింది. మధ్యాహ్న భోజనం ప్రారంభించలేదని చెప్పింది. పాఠశాల ఆవరణలో ప్రైవేట్ వ్యక్తులు ఇసుక డంపు ఏర్పాటు చేశారని, ఈ విషయాన్ని కాంప్లెక్స్ హెచ్‌ఎం జయరాజ్ దృష్టికి తీసుకెళ్లినట్లు ఆమె తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాల కింద ఈ పాఠశాలలో నిర్మాణ పనులు చేపట్టడం గమనార్హం.



తాళం వేసి ఉన్న పాఠశాల

### హిందీ మీడియంలో విద్యార్థులు నిల్..

చింతలమానేపల్లి, జూలై 9 : మండలంలోని రవీంద్రనగర్-2 గ్రామంలో జీయూపీఎస్ హిందీ మీడియం పాఠశాల ఉంది. 1 నుంచి 7 తరగతులుండగా 20 మంది విద్యార్థులున్నారు. ఉపాధ్యాయుడు కిశోర్ ఉద్యోగోన్నతిపై వెళ్లారు. ఉపాధ్యాయులు లేకపోవడంతో 20 మంది విద్యార్థులంతా ప్రైవేట్ పాఠశాలకు వెళ్తున్నారు. రెబ్బెన పాఠశాల నుంచి ఉపాధ్యాయుడు సునీల్‌ను డిప్యూటేషన్‌పై వచ్చినప్పటికీ విద్యార్థులు రావడం లేదు.

### 5 తరగతులకు ఒకే చోట పాఠాలు..

దండేపల్లి, జూలై 9: దండేపల్లి మండలంలోని కొండాపూర్ ప్రాథమిక పాఠశాలలో 1 నుంచి 5 తరగతుల్లో 42 మంది విద్యార్థులున్నారు. ఇద్దరు ఉపాధ్యాయులు ఉండగా, ఒకరు ప్రమోషన్‌పై బదిలీ అయ్యారు. ప్రస్తుతం ఉపాధ్యాయుడు సతీశ్ ఒక్కరే ఉన్నారు. 5 తరగతుల విద్యార్థులను ఒకే గదిలో కూర్చోబెట్టి పాఠాలు బోధిస్తున్నాడు. అధికారులు స్పందించి ఉపాధ్యాయులను నియమించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



కొండాపూర్ పాఠశాలలో 5 తరగతుల విద్యార్థులకు ఒకే చోట పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

### బ్రేక్‌ఫాస్ట్ అందించాలి..



దండేపల్లి, జూలై 9: చదువుకునే చిన్నారుల్లో తలెత్తే పౌష్టికాహార లోపాన్ని నివారించేందుకు ప్రారంభించిన సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకం విద్యార్థులకు మేలు కలిగింది. విద్యార్థుల ఇండ్లల్లో ఉన్న పరిస్థితుల దృష్ట్యా ఉదయం ఏమీ తినకుండానే పాఠశాలకు వస్తారు. అలాంటి వారికి ఈ పథకం ఉపయోగకరంగా ఉండేది. నిర్వాహకులకు సక్రమంగా నిధులు అందిస్తే ఈ పథకం ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయి. **-శ్రీలత, ప్రధానోపాధ్యాయురాలు.**

### మ్యాథ్స్ టీచర్ లేక ఇబ్బంది పడుతున్నాం



మా పాఠశాలకు రెండు మూడేళ్ల నుంచి మ్యాథ్స్ టీచర్ లేక ఇబ్బంది పడుతున్నాం. వేరే సారు చెబుతున్నప్పటికీ సరిగ్గా అర్థం కావడంలేదు. అలాగే ఇంగ్లిష్, తెలుగు, హిందీ, మ్యాథ్స్ టీచర్లు లేరు. ఇంగ్లిష్ మీడియం తరగతులు నిర్వహించడం లేదు. రోజూ పాఠశాలకు వస్తున్నాం, పోతున్నాం కాని సరైన విద్యాబోధన అందడం లేదు. ఉపాధ్యాయులను నియమించి మెరుగైన విద్యా బోధన అందించాలి.

**- అనిల్‌కుమార్, 9వ తరగతి, దహెగాం ప్రభుత్వ ఉన్నత పాఠశాల**

# ఇసుక మాఫియాపై ఉక్కుపాదం

**● నమస్తే కథనానికి స్పందన**

- ఇండ్లపైకి దాడికి వెళ్లినందుకు, అక్రమంగా ఇసుక తరలింపుపై కేసులు నమోదు
- 80 ట్రిప్పుల ఇసుక డంప్‌లను స్వాధీనం చేసుకున్న పోలీసులు
- తొమ్మిది మంది ట్రాక్టర్ యాజమానులు తహసీల్దార్ ఎదుట బైండోవర్
- విలేకరులతో వివరాలు వెల్లడించిన జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్



రామారావుపేటలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక నిల్వలను సీజ్ చేస్తున్న అధికారులు



తహసీల్దార్ ఎదుట బైండోవరైన తొమ్మిది మంది ట్రాక్టర్ డ్రైవర్లు



విలేకరులతో మాట్లాడుతున్న ఏసీపీ వెంకటేశ్వర్, ఎస్ఐ శ్రీధర్

మంచిర్యాల, జూలై 9(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : గోదావరి పరీవాహక ప్రాంతమైన జైపూర్ మండలంలోని ఇందారం నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న మాఫియాపై పోలీసులు కేసులు నమోదు చేశారు. ఇందారంలో ఇసుక అక్రమార్కులు రెచ్చిపోతున్న తీరుపై నమస్తే తెలంగాణ 'అక్రమంగా ఇసుక తవ్వుతాం.. అడ్డుకుంటే దాడు లు చేస్తాం' అన్న శీర్షికన మంగళవారం కథనం ప్రచురించింది. ఇసుక అక్రమంగా తరలిస్తుంటే ఫొటోలు, వీడియోలు తీసిన కొందరు ఇందారం గ్రామస్తులపైకి ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లు, వర్కర్లు దాడికి వెళ్లిన విషయాన్ని వెలుగులోకి తీసుకొచ్చింది. మంగళవారం ఉదయం నుంచి 'నమస్తే' కథనంతోపాటు ఆదివారం రాత్రి దాడికి వెళ్లిన వీడియోలు వాట్సాప్ గ్రూపులు, సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దీంతో ఈ వ్యవహారంపై పోలీసులు, రెవెన్యూ అధికారులు స్పందించారు. ఇందారంతోపాటు గోదావరి చుట్టు పక్కల గ్రామాల్లో మంగళవారం తనిఖీలు నిర్వహించి అక్రమంగా నిలువ చేసిన ఇసుక డంప్‌లను గుర్తించారు. ఇసుక మాఫియా నడిపిస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్ మంగళవారం సాయంత్రం విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

### పలువురిపై కేసులు

ఇందారం గోదావరి నుంచి ఇసుక తీసుకెళ్లే మాఫియా గోదావరి ఒడ్డున డంప్‌లు ఏర్పాటు చేసుకుని టిప్పర్ల ద్వారా తరలిస్తున్నట్లు మాకు సమాచారం వచ్చిందన్నారు. రెండు రోజుల క్రితం మా ఎస్ఐ శ్రీధర్ దాదాపు 50 ట్రిప్పుల ఇసుక డంప్‌లను పట్టుకున్నారని, ఈ రోజు తనిఖీలు నిర్వహించి మరో 30 ట్రిప్పుల ఇసుక పట్టుకున్నామని చెప్పారు. ఇసుకను సీజ్ చేసి బాధ్యులైన వ్యక్తులపై సెక్షన్ 379 కింద కేసు నమోదు చేశామన్నారు. ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న ఫొటోలు, వీడియోలను సోషల్ మీడియాలో పెట్టిన వ్యక్తుల ఇండ్లపైకి దాడికి వెళ్లిన మహమ్మద్ జైనుద్దీన్, గుండా శ్రీనివాస్, బద్దెల సాయికృష్ణ, పల్లా రాజ్‌కుమార్, జక్కుల రాహుల్, బూకల స్వామి, వైద్య శేఖర్, పెద్దపల్లి సంపత్, నల్లీ దీపులపై ఐపీసీ సెక్షన్ 329(4), 351(ఆర్ డబ్ల్యూ) కింద కేసులు నమోదు చేశామన్నారు. ఈ తొమ్మిది మందికి నోటీసులు ఇచ్చి తహసీల్దార్ ఎదుట రూ.5 లక్షల పూచీకత్తుతో బైండోవర్ చేశామన్నారు. ఇప్పటికైనా తీరు మార్చుకోకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తే అందరిపైనా కేసులు నమోదు చేస్తామన్నారు. పట్టుబడే ట్రాక్టర్లను సీజ్ చేయడంతోపాటు ట్రాక్టర్ యాజమానులు, డ్రైవర్లపై సస్పెక్ట్ షీట్ కూడా ఓపెన్ చేస్తామన్నారు. ఎవరైనా సరే లీడర్ల పేర్లు, పోలీసుల పేర్లు చెప్పి ట్రాక్టర్లతో ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఇసుక కావాల్సిన వాళ్లు ప్రభుత్వ రీచ్‌ల నుంచి మాత్రమే తీసుకోవాలన్నారు. విలేకరుల సమావేశంలో ఎస్ఐ శ్రీధర్ పాల్గొన్నారు.

### క్రమశిక్షణ చర్యలు తీసుకుంటాం..

ఇందారం ఇసుక తరలింపు అంశంలో తనపై వస్తున్న ఆరోపణలు సరికాదని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఫయాజ్ తెలిపారు. ఇసుక ట్రాక్టర్లకు నాకు ఎలాంటి సంబంధం లేదన్నారు. నేనంటే గిట్టని వారు నాకు ట్రాక్టర్లు ఉన్నాయంటూ నాపై అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా అసత్య ఆరోపణలు మానుకోవాలన్నారు. ఇసుక అక్రమ రవాణాలో కాంగ్రెస్ లీడర్లు ఎవరైనా ఉంటే ఎమ్మెల్యే వివేక్ దృష్టికి తీసుకెళ్లి కచ్చితంగా వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# సాగు పనులు అడ్డుకున్న ఫారెస్ట్ అధికారులు



మాట్లాడుతున్న ఆస్నాద్ గ్రామ రైతులు

చెన్నూర్ రూరల్, జూలై 9: చెన్నూర్ మండలంలోని ఆస్నాద్ గ్రామ శివారులో మంగళవారం రైతులు చేపట్టిన సాగు పనులను అటవీ శాఖ అధికారులు అడ్డుకున్నారు. రైతులు, అధికారుల మధ్య వాగ్వాదం జరిగింది. రైతులు మాట్లాడుతూ గతంలో అధికారులు తమ భూముల వద్దకు సాగు చేయవద్దని ఇబ్బంది పెట్టగా మాజీ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ చొరవతో అప్పటి అటవీశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఆదేశించడంతో వివాదం సద్దుమణిగిందన్నారు. ఇటీవల అధికారులు మళ్లీ కేసుల పేరుతో వేధిస్తుండడంతో సమస్యను ఎమ్మెల్యే వివేక్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. రైతులను ఇబ్బంది పెట్టవద్దని ఎమ్మెల్యే ఆదేశించినప్పటికీ అధికారులు వినకుండా భూముల వద్దకు వచ్చి సాగు పనులు అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే వివేక్ చొరవ తీసుకొని తమకు న్యాయం చేయాలని కోరారు.


- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం మరియు
- అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక..

నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..



ప్రకటనల విభాగం...

సెల్: 9182 777 571

మంచిర్యాల జిల్లా : 9182 777 676

కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా : 9182 777 679